www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి



పదో తరగతి విద్యార్థులకు 'గణిత దీప్తి'

విడుదల చేసిన డిఇఒ నాగమణి

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం తయారుచేసిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను కలెక్టరేట్లో రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఈ మెటీరియల్‌ను వినియోగించుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కె.సంధ్య, ఎస్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ తిరుపతిరాజు, ఎపిఎంఎఫ్ స్టేట్ సెక్రటరీ జి.శ్రీనివాసవర్మ, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవానికి పైసలివ్వాల్సిందే..!

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఓవైపు చెబుతుంటే దీనికి భిన్నమైన పరిస్థితులు కొన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కన్పిస్తున్నాయి. వాటిలో ఒకటిగా నరసాపురం ఏరియా ఆస్పత్రి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల తాడేపల్లిగూడెంలో నిండు గర్భిణీ పట్ల వైద్య సిబ్బంది ప్రవర్తించిన తీరు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అదే విధంగా నరసాపురం ఏరియా ఆసుపత్రిలో కొందరు ఉద్యోగుల తీరు అభ్యంతరకరంగా ఉంటోందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

కౌన్సెలింగ్ పేరిట గంటల తరబడి నిరీక్షణ
గతంలోనూ సదరు ఉద్యోగిపై ఫిర్యాదులు
గర్భిణులకు తప్పని తిప్పలు



నరసాపురం ఏరియా ఆసుపత్రి



ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న బాలింతలు

ప్రజాశక్తి - నరసాపురం

గర్భిణులు అంటే సామాన్యులు సైతం మానవతాదృక్పథంతో వ్యవహరిస్తారు. అయితే నరసాపురం ఏరియా ఆసుపత్రికి వచ్చిన గర్భిణుల పట్ల సిబ్బంది గంటల తరబడి వేచిచూసేలా జాప్యం చేస్తూ నిర్దయగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో గర్భిణులతోపాటు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021లో ఈ ఆసుపత్రిని నూతన భవనంలో ప్రారంభించారు. ప్రతిరోజూ ఈ ఆసుపత్రికి సుమారు 400 నుంచి 500 మంది వరకూ రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ 80 మందికిపైగా గర్భిణులు నెలవారీ పరీక్షల నిమిత్తం వస్తుంటారు. ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో గర్భిణులకు వైద్యులు సేవలందిస్తారు. ప్రతిరోజూ 300 నుంచి 350 మంది రక్త పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వస్తుంటారు. వీరికి రెండు విభాగాల్లో రక్త పరీక్షలు నిర్వహిస్తారు. నరసాపురం తీర ప్రాంతాల నుంచి కాకుండా కృష్ణా జిల్లా బంటుమిల్లి, కృత్తివెన్ను, కోనసీమ జిల్లా మల్కిపురం, రాజోలు, సఖినేటిపల్లి నుండి సైతం వైద్య సేవల నిమిత్తం ఈ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 23 మంది వైద్యులు ఉండగా 20 మంది అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ వైద్య సేవలు నిరంతరాయంగా అందించడంతోపాటు రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికల నోటీసులు సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్కరే గైనకాలజిస్టు ఉండటంతో ఆమెపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోంది.

అయితే కొందరు దిగువస్థాయి ఉద్యోగుల వల్ల ప్రభుత్వాసుపత్రికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగితే సంబంధిత బాలింత బంధువుల నుంచి కొందరు ఉద్యోగులు డబ్బు వసూలు చేస్తున్నారు. ఈ నెల 21న నరసాపురం పట్టణంలోని 17వ వార్డుకు చెందిన మహిళ ప్రసవానికి వెళ్లగా వారి వద్ద నుంచి రూ.4 వేలు డిమాండ్ చేయగా రూ.రెండు వేలు సమర్పించుకోవాల్సి వచ్చిందని సమాచారం.

అదే సమయంలో కౌన్సెలింగ్ పేరుతో గర్భిణులు, టిబి రోగులను ఎక్కువసేపు నిరీక్షించేలా చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో రోగి, అతని బంధువులు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. కొంత స్థోమత ఉన్నవారు ఈ పడిగాపులు, అవస్థలు ఎందుకని ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొన్ని సమయాల్లో సదరు ఉద్యోగి తీరు కూడా అభ్యంతరకరంగా ఉంటోందని గర్భిణులు వాపోతున్నారు. కౌన్సెలింగ్ పేరుతో సదరు పురుష ఉద్యోగి గర్భిణిని ఒక్కరినే రూమ్‌లోకి అనుమతించి, వెంట బంధువులను, ఆశా కార్యకర్తనుగాని రానీయకపోవడం, విచిత్రమైన, ఇబ్బందికర ప్రశ్నలు వేస్తున్నారని పలువురు గర్భిణులు వాపోతున్నారు. ఈ విధంగా ఒక్కో గర్భిణిని సుమారు 15 నిమిషాల నుంచి 20 నిమిషాల పాటు ఒంటరిగా కౌన్సెలింగ్ పేరిట పురుష ఉద్యోగి వ్యవహరిస్తున్న తీరుపై పలువురు అభ్యంతరం తెలిపినా, విధులకు పైఅధికారులు హెచ్చరించినా మార్చుకోవడం లేదని ప్రచారం సాగుతోంది. సదరు ఉద్యోగి ఇదే ఆసుపత్రిలో చాలాకాలంగా తిష్టవేసి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగిపై గతంలో పలువురు ఆశా కార్యకర్తలు, హెల్త్ సిబ్బందిసైతం వైద్యులకు ఫిర్యాదు సైతం చేశారు. అయినా అతని తీరు మారలేదని అటు సిబ్బంది, ఇటు గర్భిణులు వాపోతున్నారు. కౌన్సెలింగ్ పేరుతో సమయం వృథా చేయడం వల్ల రోగులు ఎంతగానో ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులను ఒంటరిగా కౌన్సెలింగ్ పేరిట ఎక్కువ మందికి టెస్టులు చేస్తే తనకు గుర్తింపు వస్తుందని స్వలాభాపేక్షతో రోగులతోపాటు వచ్చే బంధువులను సైతం రిజిస్టర్లో పేర్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఒక్కసారి బుక్‌లో, మరోసారి కంప్యూటర్లో పేర్లు నమోదు చేస్తూ సమయాన్ని ఈ ఉద్యోగి సమయాన్ని వృథా చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఈ నెల 23న నరసాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి ఉదయం ఆస్పత్రికి రాగా ఓపి రాయించుకుని కౌన్సెలింగ్‌కు వెళ్లగా సుమారు రెండు గంటల సమయం పట్టింది. అనంతరం రక్త పరీక్షకు రాగా ఇద్ శాంపిల్ తీసుకోవడానికి సమయం మధ్యాహ్నం రెండు గంటలైంది. పరీక్షల అనంతరం రిపోర్టులు చూసుకుని డాక్టర్ వద్దకు వెళ్లగా డాక్టర్ అందుబాటులో లేరు అని వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో గర్భిణి మధ్యాహ్నం భోజనం చేయకుండా డాక్టర్ వచ్చే వరకూ వేచిచూడాల్సి వచ్చింది. ఈ పరిస్థితికి సదరు ఉద్యోగి నిర్వాకమే కారణమని తెలుస్తోంది. సదరు ఉద్యోగిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, గర్భిణులు కోరుతున్నారు. టిబి పేషెంట్లను సైతం ఇదే రీతిన ఇబ్బంది పెడుతున్నారని చెబుతున్నారు. దీంతో వారు పరీక్షలు సైతం ఆసుపత్రిలో చేయించుకునే అదును పెట్టుకుండా వెనకడుగు వేస్తున్నారు. ఇదే ఆసుపత్రిలో టిబి విభాగంలో పని చేస్తున్న ఉద్యోగి నెలకు కనీసం ఐదుగురు టిబి పేషెంట్లను తీసుకురావాలని ఆశా కార్యకర్తలకు హుకుం జారీ చేస్తున్నారు. లేకుంటే ప్రతినెలా ఆశా డే రోజున ఆశాలను అందరి ముందు తిడుతున్నారు. దీంతో ఆశా కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు కోరుకుంటున్నారు.

ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

ఆర్.సుప్రియ, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, నరసాపురం



ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలూ ఉచితం. అన్ని రకాల పరీక్షలూ వైద్య సేవలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఎవరైనా పేషంట్లు, బంధువుల వద్ద డబ్బులు వసూలు చేస్తే నేరుగా నాకు ఫిర్యాదు చేయండి. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఎవరైనా పేషెంట్లను వేధించినా, సేవల్లో ఏమైనా లోపాలుగాని, అవినీతిగాని ఎదురైతే నాకు ఫిర్యాదు చేయండి. అటువంటి వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

రాయలం అభివృద్ధికి కృషి

అధికారులకు కలెక్టర్ నాగరాణి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాయలం అభివృద్ధికి సంబంధిత ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం మండలం రాయలం పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలుత పంచాయతీలోని అన్ని గదులనూ పరిశీలించారు. పంచాయతీ భవనం కింద అంతస్తులో ఏర్పాటుచేసిన వెల్నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడారు. రోజుకు ఎంతమంది వైద్య సహాయం కోసం వస్తున్నారు. అవసరమైన మందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అనంతరం రాయలం-1, 2 సచివాలయాల సిబ్బంది మాట్లాడారు. పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి విషయాన్నీ సచివాలయ సిబ్బంది కలిసికట్టుగా ప్రజలకు చేరువయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక ఆధార్ సవరణ క్యాంపుల సమాచారాన్ని గ్రామ ప్రజలకు చేరవేయడంలో అలసత్వం కనిపిస్తోందని, భవిష్యత్తులో ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఏ సర్వీస్‌లు ఎన్ని రోజుల్లో అందజేస్తున్నారని అడిగి సంబంధిత వెబ్ పోర్టను పరిశీలించారు. ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన అమలు తీరును తనిఖీ చేసి నివేదికను పరిశీలించాలని పలు ఆదేశాలు జారీ చేశారు. రాయలంలో పంచాయతీ పరిధిలో రూ.1.48 కోట్లతో చేపట్టిన వివిధ పనులపై ఆరా తీశారు. ఏయే పనులు ఎంత ఖర్చుతో ఏయే తేదీల్లో చేపట్టారో పరిశీలించి ఫొటోలతో సహా నివేదికను అందజేయాలని డిపిఒ, ఎంపిడిఒలను ఆదేశించారు. రాయలం గ్రామ పంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలకు, వ్యాపార సముదాయాలకు అనుమతించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పలు వివరాలను ఆరా తీశారు. పంచాయతీ సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం గ్రామస్తులు రాయలం మురుగు డ్రెయిన్ సమస్యను కలెక్టర్‌కు విన్నవించారు. మురుగు కాలువ వల్ల పంటల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సార్వా పంట కూడా వేయలేదని, మురుగు కాలువ పూడికతీత పనుల నిర్వహణకు నిధులు మంజూరు చేసి, పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే ప్రతిపాదనలను పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. అనంతరం రాయలం మురుగు కాలువను జిల్లా కలెక్టర్ సంబంధిత గ్రామస్తులతో కలిసి స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట డిపిఒ వి.అరుణశ్రీ, ఎంపిడిఒ ఎన్.మురళి గంగాధర్‌రావు, పంచాయతీ సెక్రటరీ డిఎస్.పద్మాజీరావు, ఇఒపిఆర్‌డి జెవి.నామేశ్వరరావు పాల్గొన్నారు.



పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

దెయ్యాలతిప్పలో సమస్యలు పరిష్కరించాలని నిరసన

భీమవరంటౌన్: దెయ్యాలతిప్పలో తాగునీరు ఫిల్టర్ చేయాలని, వీధిలైట్లు, రోడ్లు వేయాలని డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో దెయ్యాలతిప్ప ఎస్‌సి పేటలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీరు, రోడ్లు, డ్రెయినేల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పోతురాజు పుణ్యవతి, దొడ్డి మేరమ్మ, మోరాళ్ల రాజేశ్వరి, తానేటి మార్తమ్మ, దొడ్డి ప్రభాకర్ రావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

యానిమేటర్ల వేతన బకాయిలు విడుదల చేయాలి

ఎపి వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - భీమవరం

వెలుగు యానిమేటర్ల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాజకీయ వేధింపుల పేరుతో అక్రమ తొలగింపులు ఆపాలని ఎపి వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భీమవరం సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎ.నిర్మలాదేవి మాట్లాడుతూ ఆరు నెలల బకాయిలు ఉన్నాయని, పండుగల కాలంలో జీతాల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని మండలాల్లో విఒఎలను తొలగించి కూటమి నాయకుల ప్రతినిధులను ఉద్యోగాల్లో వేసుకోవాలనే పేరుతో వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ గ్రామస్థాయి నాయకులు వెలుగు అధికారులపై ఒత్తిడి చేసి రికార్డులు అప్పగించబోమని, తొలగిస్తామని వంటి బెదిరింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన కాలపరిమితి జిఒను మరలా ఈ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చి విఒఎల ఉద్యోగ భద్రతపై ప్రమాదాన్ని తీసుకొస్తోందని, విఒఎలు అందరూ ఐక్యతతో ఉండాలని కోరారు. కొన్ని మండలాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు వచ్చి సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విఒఎల సమస్యలపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాయ్ మాట్లాడుతూ విఒఎలు అనేక ఏళ్ల నుంచి పనిచేస్తూ ప్రభుత్వం మారిందనే పేరుతో వేధింపులు, తొలగింపులు వెంటనే ఆపాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో గోవిందమ్మ, లక్ష్మీకుమారి, పద్మావతి, దుర్గ, లక్ష్మి మాట్లాడారు.

రీసర్వే గ్రామసభల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభల ద్వారా అధికారుల దృష్టికి వస్తున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని తక్షణం పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. డ్రోన్ల సహాయంతో గత ప్రభుత్వం జరిపిన భూ సర్వే అనేక అవకతవకలకు కారణమైందని, రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు టిడిపి కూటమి పార్టీలు గత ప్రభుత్వం భూ సర్వే వైఫల్యాలను బూచిగా చూపించి రైతాంగంలో మరింత గందరగోళాన్ని సృష్టించి ఎన్నికల్లో ప్రయోజనం పొందిందని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రచారం నేడు రైతాంగంలో మరింత ఆందోళనకు కారణమైందని, తాతల తండ్రుల నుంచి తమకున్న భూములు, పట్టాదారు పాసుపుస్తకాలు వాస్తవ భూమిని తప్పులతడకగా చేసి, డ్రోను సర్వే పేరుతో రైతాంగానికి ఏ విధమైన ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సర్వే చేశారని తెలిపారు. ఈ సర్వే అనేక అవకతవకలకు దారితీసిందని తెలిపారు. ఈ అవకతవకల వల్ల రైతులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, రీ సర్వే రెవెన్యూ గ్రామ సభల్లో ఇది స్పష్టమవుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే వాటి ప్రాధాన్యత రెవెన్యూ గ్రామసభలపై ప్రభుత్వం ముందుగా రైతులకు సంపూర్ణ అవగాహన కలిగించలేదని బాబూరావు పేర్కొన్నారు. గ్రామ సభల్లో భూ రీసర్వే కోసం రైతాంగం పెద్ద ఎత్తున దరఖాస్తులు అందిస్తున్నారని, ఐదు విభాగాలుగా ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోందని టిడిపి కూటమిలోని బిజెపి కేంద్రంలో భూ సర్వే నిర్వహించాల్సిన అవసరాన్ని రైతాంగానికి వివరించాలని కోరారు. రాష్ట్రంలో రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్న భూ సర్వే విధానాన్ని రైతాంగానికి వివరించాలని బాబూరావు కోరారు. తక్షణం ప్రభుత్వం రైతాంగానికి భూ రీసర్వే విధానాలను స్పష్ట పర్చాలని, రైతుల భూ హక్కులు కాపాడాలని పుల్లారెడ్డి కోరారు.

నేడు భీమవరానికి త్రిపుర గవర్నర్ రాక

ప్రజాశక్తి - భీమవరం

త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి శనివారం భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో కార్యక్రమం అనంతరం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు భీమవరం పర్యాటక శాఖ అతిథి గృహానికి చేరుకోనున్నారు. రాత్రి 7 గంటలకు పర్యాటక శాఖ అతిథి గృహంలో సమావేశానికి హాజరవుతారు. రాత్రి 8.30 గంటలకు స్థానికంగా విందుకు హాజరై తిరిగి 9:30కు టూరిజం గెస్ట్ హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేయనున్నారు. 27న ఉదయం 7.30 గంటలకు టూరిజం అతిథి గృహం నుంచి బయలుదేరి ఆనంద ఫంక్షన్ హాల్లో జరిగే వివాహ వేడుకల్లో పాల్గొనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆనంద ఫంక్షన్ హాల్ నుంచి దొంగపిండి ఫిష్ కల్చర్ ట్యాంక్ వద్దకు చేరుకుంటారు. 10 గంటలకు అక్కడి నుండి బయలుదేరి లోసరిలోని ఆనంద ఫిష్ ఫీడ్ ప్లాంట్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 10:30 గంటలకు బయలుదేరి తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్ అండ్ ఫంగస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తుందుర్రు ఆనంద గెస్ట్ హౌస్‌లో భోజన విరామం అనంతరం ఒంటి గంటకు జువ్వలపాలెం ఆనంద గెస్ట్ హౌస్ చేరుకుని ఎలైట్ సిబ్బంది, వ్యాపారవేత్తలు, మీడియాతో పరస్పర చర్చలో పాల్గొనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి తాడేపల్లిగూడెం వెళతారు. 4 గంటలకు తాడేపల్లిగూడెంలో ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు తాడేపల్లిగూడెం నుంచి బయలుదేరి విజయవాడ విమానాశ్రయానికి వెళతారని సమాచార శాఖ అధికారులు తెలిపారు.

స్వాతంత్రోద్యమంలో 'వంక' ప్రధాన భూమిక

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - తణుకు

స్వాతంత్ర్యోద్యమంలో వంక సత్యనారాయణ ప్రధాన భూమిక పోషించారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్వాతంత్ర సమరయోధులు, సిపిఐ ఉద్యమనేత, మాజీ ఎంఎల్ఎ వంక సత్యనారాయణ 6వ వర్ధంతి సభ శుక్రవారం స్థానిక వంకా సత్యనారాయణ సురాజ్య భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగింది. తొలుత వంకా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టుల ఉద్యమ నిర్మాణానికి పునాధులు ఉద్దరాజు రామం వేస్తే ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో వంక సత్యనారాయణ వంటి వారు ప్రధాన పాత్ర పోషించారన్నారు. తరువాత చీలికలో రాష్ట్రంలో, జిల్లాలో ఉద్దరాజు రామం, వంక సత్యనారాయణ, సంకు అప్పారావు, ఇందుకూరి సుబ్బరాజు, అల్లూరి సత్యనారాయణ, ఆర్ఎస్, ఎస్ఆర్.దాట్ల, మణిపూసలు వంటి అమరవీరులు వీరందరూ ప్రజల మనస్సులతో ఎప్పుడూ కలిసున్నారన్నారు. వంకా ఈ రాష్ట్రంలో, జిల్లాలో ప్రజల సమస్యల్ని అసెంబ్లీలో కమ్యూనిస్టు ప్రజాప్రతినిధిగా తన వాణిని వినిపించడంలో ముఖ్య భూమికను పోషించేవారన్నారు. దేశ రాజకీయాలు చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నాయన్నారు. ఎన్నికల్లో ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బిజెపి ఓడిపోవాలని, ఒక లౌకిక ప్రభుత్వం ఏర్పడాలని, ప్రజల గొంతు అయిన వామపక్షాల బలం పెరగాలని కోరుకున్నామన్నారు. అయితే మనం అనుకున్న మూడు పూర్తిస్థాయిలో జరగకపోయినా బిజెపి దూకుడును, దాని ప్రమాదాన్ని నుంచి కొద్దిగైనా నివారించగలిగామన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న రోజుల్లోనే పార్టీ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలూ శ్రమించిన పోరాట యోధుడు అన్నారు. బడుగుల వాణిని చట్ట సభలో వినిపించిన అసెంబ్లీ టైగర్ వంకా సత్యనారాయణ ఆశయ సాధనకు పునరంకితం కావాలన్నారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్‌వి.రామారావు మాట్లాడుతూ విలువలు పత్రికలకేనా రాజకీయ పార్టీలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఆర్థికాంశాల సారాంశమే రాజకీయాలని, నాటి మీడియా స్వాతంత్ర లక్ష్యాల కోసం పరితపిస్తే నేటి మీడియా రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛ ఎమర్జెన్సీ కాలంలోనే కనిపించిందని నేడు పత్రికా స్వేచ్ఛ ప్రశ్నార్ధకంగా మారిందని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ వంకా సత్యనారాయణ జిల్లాను పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా రంగాల్లో ముందుకు నడిపించారని, పేదలకు భూపంపిణీలో జిల్లాకు రెండో పంట తీసుకురావడంలో తీవ్రంగా కృషి చేశారన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాధ్ మాట్లాడుతూ వంక ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, నేటి సమకాలీన అంశాలపై చర్చ జరగాలన్నారు. వేరే పార్టీలో ఉన్నా కమ్యూనిస్టు భావజాలంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంకా రామదాసు, డాక్టర్ వసుంధర, వంకా రాజకుమారి, డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు, అరుణరేఖ, బి.సీతామహాలక్ష్మి, సంకు మనోరమ, కవి వివిఎస్‌వి.ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, ఎం.సీతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

పేద విద్యార్థులకు ఉచిత సీట్లు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

విద్యా హక్కు చట్ట ప్రకారం పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల విద్యాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పెనుగొండ గ్రామ శాఖా కార్యదర్శి నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ 2023 ఫిబ్రవరి 26న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 2024 సంవత్సరంలో హైకోర్టు రద్దు చేయడంతో, స్థానిక భాష్యం, శ్రీచైతన్య యాజమాన్యాలు తమ స్కూల్లో చదివే విద్యార్థులను గత రెండు సంవత్సరాల ఫీజులు చెల్లించాలని వేధింపులకు గురిచేస్తున్నాయని తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు సిపిఎం ఆధ్వర్యంలో ఎంఇఒలు-1, 2 సుధాకర్, రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ భాష్యం స్కూల్ యాజమాన్యంతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకూ ఫీజులు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, గుర్రాల సత్యనారాయణ, తల్లిదండ్రులు ఎస్.అనూష, ఆర్.అనూష, టి.విజయ్‌కుమార్, యు.బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

రోడ్లకు మహర్దశ : ఎంపిపి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో పలు రహదారులకు మహర్దశ పట్టనుందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని తెలిపారు. మండలంలో పలు రోడ్లకు నిధులు మంజూరైనట్లు ఆమె శుక్రవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. రూ.78 లక్షలతో త్వరలోనే పలు రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా రూ.50 కోట్లతో రోడ్లను పటిష్టపర్చనున్నట్టు తెలిపారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కృషి వల్లే ఈ నిధులు సాధ్యపడ్డాయన్నారు. రూ.10 లక్షలతో వీరవాసరం - పెనుమంత్ర ఆర్అండ్‌బి రహదారి బుదరాయుడు చెరువు నుంచి వయా బిజిపాలెం, తోలేరు మీదుగా తమ్మినీడిపాలెం వరకూ, రూ.13 లక్షలతో కొణితివాడ నుంచి మడుగుపోలవరం లంక వరకూ, రూ.7 లక్షలతో వీరవాసరం నుంచి పెర్కిపాలెం వరకూ, రూ.8 లక్షలతో దూసనపూడి నుంచి శృంగవృక్షం గేటు వరకూ, రూ.10 లక్షలతో కమతాలపల్లి నుంచి దూసనపూడి వరకూ, రూ.20 లక్షలతో దూసనపూడి నుంచి బేతపూడి వరకూ, రూ.10 లక్షలతో తోలేరు విపి రోడ్డు నుంచి తోలేరు వరకూ ఆర్ అండ్ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు రూ.7.80 కోట్లతో తోలేరు నుంచి శృంగవృక్షం, వేండ్ర రోడ్డు వరకూ, రూ.8 కోట్లతో బుదరాయుడుచెరువు నుంచి తమ్మినీడివారిపాలెం రోడ్డు వరకూ, రూ.7 కోట్లతో వీరవాసరం నుంచి బాలేపల్లి మీదుగా దూసనపూడి వరకూ, రూ.4 కోట్లతో కమతాలపల్లి నుంచి బేతపూడి వరకూ, కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.16 కోట్లతో ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ కృషితో నవుడూరు నుండి మడుగుపోలవరం వరకూ ఆర్అండ్‌బి రోడ్లను పటిష్టపర్చేందుకు ప్రతిపాదనలు ఎంఎల్ఎ పంపారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి మండలాధ్యక్షులు కొల్లేపర శ్రీనివాసరావు, కోడి నర్సింహారావు, వీరవల్లి చంద్రశేఖర్, వీరవల్లి శ్రీనివాసరావు, ఇర్రింకి మాధవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని

పశువుల సమగ్ర సమాచారమివ్వాలి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభమైన కారణంగా మీ ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువుల సమగ్ర సమాచారాన్ని అందించాలని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కోరారు. తద్వారా పశుగణన పథకాల రూపకల్పనకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకటరమణ, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగరాయలు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, గంట కృష్ణ, కోటిపల్లి సురేష్ పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలి

సిపిఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - గణపవరం

ఉరదాళ్లపాలెం నుంచి రామచంద్రపురం వెళ్లే రహదారిని వెంటనే నిర్మించాలని సిపిఎం కోమర్రు శాఖా మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం కోమర్రులో జరిగిన మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని విప్పర్తి సత్యం ఆవిష్కరించారు. మహాసభలో పాల్గొన్న పార్టీ జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరశింహమూర్తి మాట్లాడుతూ అత్తిలి నుంచి రామచంద్రపురం వరకు ఉన్న మెయిన్ రోడ్డుపై ప్రయాణం చేయడానికి ప్రయాణికులు తీవ్ర ఇబందులు పడుతున్నారని అన్నారు. కాలనీలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని తెలిపారు. గ్రామంలో అర్హత కలిగిన వారందరికీ పెన్షన్లు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కోమర్రు నూతన శాఖా కార్యదర్శిగా నక్కా సత్యనారాయణను మహసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కాలనీలో డ్రెయినేజీల సమస్య పరిష్కారం చేయాలని మహాసభ తీర్మానించింది. మహాసభలో నక్కా లక్ష్మణరావు, పోసూరి సత్యవతి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉండి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఉండి

మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం జరగనున్న సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు, మండలస్థాయి అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.రవీంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రతి ఒక్కరికీ వంద పని దినాలు

టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగా రాజు

ప్రజాశక్తి - ఉండి

అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద పనిదినాలు కల్పించేందుకు పనులను గుర్తించడం జరిగిందని ఉపాధి పనుల టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగా రాజు తెలిపారు. శుక్రవారం ఉండి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండో దఫా గ్రామసభలో సుమారు రూ.45 లక్షల వ్యయంతో కూడిన 64 పనులు గుర్తించడం జరిగిందని, పశువులకు సంబంధించి రెండు షెడ్లు వేసుకునేందుకు వీలుగా పనులు గుర్తించామని, దీనివల్ల ఉపాధి హామీ కూలీలు అందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. వీటిని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

దంత పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కావు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ పాలకొల్లు అధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు సూచనల మేరకు శుక్రవారం విద్యార్థులకు దంత పరిరక్షణ అవగాహనా సదస్సు స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులోని చాతుర్య స్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ పెనుమాక భార్గవి సాయిశ్రీ చిన్నారులకు దంత పరిరక్షణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి, పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ యునైటెడ్ కావు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్‌ని స్థాపించి 4 సంవత్సరాలు పూర్తికావస్తుందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి క్లబ్ ద్వారా అధ్యక్ష, కార్యదర్శులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్లబ్ సభ్యులు, దాతల సహకారంతో పేద కుటుంబాలకు నిత్యావసరాలతోపాటు, విద్యార్థులకు చదువు నిమిత్తం ఎడ్యుకేషన్ డోనేషన్లు, ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి తమవంత సమాజసేవకు కృషిచేయాలన్నారు. అనంతరం చిన్నారులకు టూత్ బ్రష్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేరుకొండ దుర్గా ప్రసాద్, జక్కంపూడి కుమార్, యర్రంశెట్టి వెంకటరత్నం, ఇనుకొండ శేషాద్రి, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలకేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో ఉన్న కూరగాయల మార్కెట్లో శుక్రవారం భారీ అన్న సమారాధన చేశారు. ఇటీవల దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కూరగాయల మార్కెట్లో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బారాయుడును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఉప సర్పంచి బోణం నరసింహారావు, ముక్కు ఓం, పుల్లయ్య నాయుడు, దొంగ స్వామి, కొల్లాటి కనక సుబ్బారావు, వన్నెం రెడ్డి శ్రీను తదితరులున్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్

పెనుమంట్ర : ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడురోజుల పాటు మార్టేరులో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ జరుగుతాయని స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎస్ఎన్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ స్కూల్ గేమ్స్ అండర్-17 వయస్సు గల బాలురు, బాలికలకు విడివిడిగా ఫ్లడ్ లైట్స్ కాంతిలో బాస్కెట్ బాల్ పోటీలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లు రెండు విభాగాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 26వ తేదీ శనివారం సాయంత్రం జరిగే గేమ్స్ ప్రారంభ సభలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీమంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్‌జెడి(కాకినాడ), డిఇఒ జి.నాగమణి, జిల్లా, మండల, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొంటారని వారు తెలిపారు.

లెగసీ వేస్టు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

నరసాపురం : పట్టణంలోని 14వ వార్డులో డంపింగ్ యార్డులో గత కొంతకాలంగా పెండింగ్‌లో వున్న సుమారు రూ.3.72 కోట్ల అవినాష్ కంపెనీ వారితో కుదుర్చుకున్న లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం, డిప్యూటీ సిఎం సహకారంతో ఈ యూనిట్ కార్యరూపంలోకి వచ్చిందన్నారు. రోజుకు సుమారుగా 600 టన్నుల తడి, పొడి చెత్తను వేరు చేసి, అదే విధంగా గాజు, ప్లాస్టిక్, లోహపు చెత్తను వేరు చేసి వాటిని జిందాల్ కంపెనీ వారికి అందిస్తారన్నారు. ఇందులో ఆఖరుగా వచ్చే మట్టి రంగులో ఉండే దానిని ఆర్గానిక్ ఎరువుగా మార్చి రైతులకు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకటరమణ, కోటిపల్లి వెంకటేశ్వరావు, వైస్ చైర్మన్ కొత్తపల్లి భుజంగరాయలు పాల్గొన్నారు.

'వైసిపి బలోపేతానికి కృషి'

కాళ్ల : పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో కలిసి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం పెదఅమిరంలో వైసిపి కార్యాలయంలో జిల్లాలోని నియోజవర్గ ఇన్‌ఛార్జులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు మాట్లాడుతూ నాలుగు నెలలకే టిడిపి ప్రభుత్వ వైఫల్యాలు బయట పడుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలను మరచిన ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించే విధంగా ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు.

భూ హెచ్చుతగ్గుల తగాదాలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - వీరవాసరం

రీసర్వేలో భాగంగా సంబంధిత భూమికి సంబంధించి హెచ్చుతగ్గుల సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందని తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు తెలిపారు. రీసర్వే గ్రామసభలను శుక్రవారం మత్స్యపురిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఉన్నదాని కంటే దస్తావేజులలో ఎక్కువ చూపించి భూమిపై అందుకు తగ్గ విస్తీర్ణం లేకపోతే ఏమీ చేయలేమన్నారు. హెచ్చుతగ్గుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావచ్చునని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి సరిహద్దు యజమానులు ముందుకు రావాలన్నారు. ఈవిధంగా 443 ఎల్‌పిఎంలు సరిజేసే అవకాశం ఉందన్నారు. సర్పంచి కారిపెల్లి శాంత్రిప్రియ, ఉపసర్పంచి జవ్వాది భాస్కరరావులు పాల్గొన్నారు.


పాలకోడేరు : మాట్లాడుతున్న సూర్యనారాయణ రాజు

పాలకోడేరు : భూ సమస్యలకు సంబంధించి అర్జీ పెడితే సమస్యలు పరిష్కరిస్తామని పాలకోడేరు తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి అన్నారు. గరగపర్రు సచివాలయ కార్యాలయం వద్ద రిసర్వే గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రీ సర్వే వంటి అంశాలపై రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఎంతో ఉపయోగపడుతున్నాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఆర్ఐ కె.రాఘవ మూర్తిరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఇందుకూరి బలరామరాజు, చంటి రాజు పాల్గొన్నారు.

ఉండి : రీ సర్వే వద్దు పాత పద్ధతి ముద్దు అంటూ మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన రైతులు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. శుక్రవారం ఉండి మండలం పాందువ్వ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఉండి తహశీల్దార్ కావడి నాగార్జునకు రైతులు 10 దరఖాస్తులు అందజేశారు. రైతుల నుంచి రీ సర్వేకు వ్యతిరేకత రాగా కావడి నాగార్జున మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు రీసర్వేపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని అన్నారు. ఎల్‌పి నెంబర్లు సమిష్టిగా వచ్చిన రైతుల విజ్ఞాపన మేరకు వారికి విడిగా ఎల్‌పి నంబర్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, సర్వేయర్ రత్నావళి, మంతెన సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటా ఫీవర్ సర్వే చేయాలని గణపవరం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు అన్నారు. శుక్రవారం సరిపల్లి ఎస్‌సి పేటలో జరిగిన ఫ్రైడే డ్రైడేలో పాల్గొని మాట్లాడారు. స్థానికులు ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని చెప్పారు. ఇంటివద్ద మురికినీరు లేకుండా పొడిగా ఉంచుకోవడం వల్ల దోమలు పుట్టకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం పిఎస్.వల్లి, ఆరోగ్య కార్యకర్తలు జి.శ్రీనివాస్, ఎం.నల్లయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


అప్రెంటిస్‌లో ఎంపికైన విద్యార్థులు

అప్రెంటిస్ షిప్ మేళాలో 17 మంది ఎంపిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం శ్రీసాయి బాలాజీ కళాశాలలో నిర్వహించిన అప్రెంటిస్ షిప్ మేళాలో 17 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం రుస్తుంబాద హైదరాబాద్‌కు చెందిన రాక్వెల్ ఇండస్ట్రీస్ అప్రెంటిస్ మేళా నిర్వహించింది. కంపెనీ హెచ్‌ఆర్.దామోదర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అప్రెంటిస్‌కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ చేతుల మీదగా లెటర్స్ అందించి అభినందించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఇటీవల విజయవాడలో వచ్చిన వరద విపత్తు సమయంలో నరసాపురం మున్సిపాలిటీ నుంచి 40 మంది పారిశుధ్య కార్మికులు, సిబ్బంది విపత్తు నిర్వహణలో పాల్గొన్నారు. శుక్రవారం కార్మికులను ఎంఎల్ఎ నాయకర్ అభినందించారు. కార్మికుల విధి నిర్వహణకు అభినందనలు తెలియజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు బట్టలు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఛైర్మన్ బర్రె వెంకటరమణ, వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగరాయలు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, గంట కృష్ణ పాల్గొన్నారు.

బస్సుల దారిమళ్లింపు

డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి

నరసాపురం : కవిటం నుంచి మార్టేరు వరకూ, పెనుగొండ నుంచి పెరవలి వరకూ రోడ్డు మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా సరసాపురం డిపో నుంచి ఆ రూట్లో ప్రయాణించే బస్సులను కొద్దిరోజుల పాటు దారిమళ్లించి తిప్పుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. నరసాపురం-రాజమండ్రి వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు బ్రిడ్జి, ఆలమూరు మార్టేరు మీదుగా వెళతాయన్నారు. విశాఖపట్టణం బస్సులు కూడా అదే రూట్లో నడుస్తాయని చెప్పారు. నరసాపురం-తణుకు రూట్లో నడిచే బస్సులు వయా పాలకొల్లు, లంకలకోడేరు, నెలమూరు బ్రిడ్జి ఆలమూరు, కంతేరు మీదుగా తణుకు వెళతాయని చెప్పారు. కమలాపురం, అశ్వరావుపేట, ద్వారకాతిరుమల, సత్తుపల్లి బస్సులు కూడా ఇదే రూట్లో నడుస్తాయని చెప్పారు. నరసాపురం-నిడదవోలు వెళ్లే బస్సులు పాలకొల్లు, లంకలకోడేరు, నెలమూరు బ్రిడ్జి మీదుగా పెరవలి, నిడదవోలు వెళ్తాయన్నారు.

మధ్యాహ్న భోజనానికి అధ్యాపకుల సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో కొనసాగిస్తున్న మధ్యాహ్న భోజన పథకంను పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రశంసించారు. శుక్రవారం కళాశాలలో అమలు జరుగుతున్న భోజన పథకం అమలు తీరు పరిశీలించి తమ కళాశాల నుంచి తమ వంతు సాయంగా రూ.17,600 విరాళం చెక్కు రూపంలో అందించారు. గత నాలుగు నెలల నుంచి ప్రభుత్వ సహకారం లేకపోయినా దాతల సహకారం తీసుకుని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడం అభినందనీయమని ఎఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో కలిసి ఎఎస్ఎన్ఎం అధ్యాపకులు సహపంక్తి భోజనం చేశారు. ఆచంట ఎంవిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నున్న శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక సేవాపరురాలు సీతమ్మ

వర్ధంతి సందర్భంగా పేదలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆచంట

సామాజిక సేవాపరురాలు, దాత పెన్మెత్స సీతమ్మ 20వ వర్ధంతిని శుక్రవారం జిన్నూరులోని పెన్మత్స సీతమ్మ స్మారక భవనంలో నిర్వహించారు. సీతమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుమారులైన పెనుమత్స గోపాల్ రాజు, వెంకటపతి రాజు(వర్మ)లు 10 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. 40 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాలకొల్లు క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షులు చేకూరి సూరిబాబు, పారిశ్రామికవేత్త రామచంద్రరాజు, ట్రస్ట్ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా పేదలకు ఆర్థిక సాయం, దుప్పట్లు అందజేశారు. అలాగే ఒక మహిళకు ఉపాధి నిమిత్తం రూ.7 వేల విలువైన కుట్టుమిషన్ అందజేశారు. పెన్మత్స సీతమ్మ చిత్రపటానికి పారిశ్రామికవేత్త పెన్మత్స రామచంద్రరాజు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాలకొల్లు క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు చేకూరి సూరిబాబు మాట్లాడుతూ పేదవారికి సహాయం చేయడంలోనూ, పలు సేవా కార్యక్రమాలు చేయడంలోనూ పెన్మత్స సీతమ్మ ముందుండేవారన్నారు. సీతమ్మ కుటుంబసభ్యులు స్థాపించిన చక్ర చారిటబుల్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. క్షత్రియ సంఘం కార్యదర్శి భూపతిరాజు సూరిబాబు మాట్లాడుతూ జిన్నూరు పరిసర గ్రామాలలో చక్ర చారిటబుల్ ట్రస్ట్ పాఠశాలలకు సురక్షిత మంచినీటి శుద్ధి యంత్రాలను అందజేయటం అభినందనీయమన్నారు. చెరుకూరి సత్యనారాయణ రాజు, కలిదిండి రామరాజు, పెన్మత్స సూరిబాబు, పెన్మత్స సుబ్బరాజు పాల్గొన్నారు. అనంతరం చక్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెనుమత్స సీతమ్మ 20వ వర్ధంతి సందర్భంగా వేడంగిలోని విశ్వ మానవ వేదిక వృద్ధాశ్రమంలో అనాథలకు, పేదలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

సాంకేతిక విజ్ఞానం మంచికి ఉపయోగించాలి

తణుకు : సాంకేతిక విజ్ఞానం సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి తప్ప, సమాజ వినాశనానికి, భవిష్యత్తు నాశనం కావడానికి ఉపయోగించుకోకూడదని రిటైర్డ్ సీనియర్ లెవెల్ ఆఫీసర్, జెజిఎం టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్, న్యూఢిల్లీ కె.ఆంజనేయశర్మ అన్నారు. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజీ(అటానమస్) కళాశాల, తణుకులో ఫ్రెషర్స్ డే సభ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరీబాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయశర్మ మాట్లాడుతూ కళాశాల విద్య జీవితంలో ముందుకు వెళ్లడానికి ఒక మైలురాయి వంటిదని అన్నారు. నూతనంగా చేరిన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల అధ్యక్షులు కెవి.సుబ్బారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్ పాల్గొన్నారు.

క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

ఆర్‌టిసి డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి

నరసాపురం : కార్తీకమాసం నేపథ్యంలో నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్టు ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఈమేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి బయలుదేరే ఈ బస్సులు సోమవారం ఒక్క రోజులోనే అన్ని క్షేత్రాలను దర్శించి తిరిగి నరసాపురానికి చేరుకుంటాయని వివరించారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నరసాపురం బస్టాండ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరతాయన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. శబరిమల, శ్రీశైలం వెళ్లే యాత్రికులకు, విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన ఏరోజుకైనా నరసాపురం డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఒక్క గ్రామం నుంచి 40 మందికిపైగా భక్తులు ఉంటే ఆ గ్రామంలో నుంచి బస్సులు నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని మాలదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట కాలువలను ఆధునికీకరించాలి

రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఆచంట


పంట కాలువలను ఆధునీకరించి, పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వల్లూరు సంత మార్కెట్ వద్ద రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో అనుభవం కలిగిన నాయకులను ఎన్నుకుంటే రైతులకు మంచి జరుగుతుందన్నారు. పంట కాలువలను ఆధునీకరించేటప్పుడు లోతుగా తవ్వకుండా కాలువ గట్లను ప్రతిష్ట పరచాలని కోరారు. కాలువలలో మట్టిని లోతుగా తవ్వడం ద్వారా పంట భూములు మెరకగా మారి నీరు వెళ్లే పరిస్థితి ఉండదని, దీంతో రైతులు ఇంజన్ల ద్వారా నీటిని తోడుకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పంట కాలువల్లోనూ, మురుగు కాలువల్లోనూ పేరుకుపోవడం వల్ల నీరు ముందుకు సాగక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంట కాలువల్లోకి పంపుతున్న కాలువల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నీరు శివారు ప్రాంతాలకు చేరుకోవడం కష్టతరంగా మారుతుందని వాపోయారు. దీంతో కాలువల నిర్వహణ గాలికి వదిలేయడంతో చెత్తాచెదారం, తూడు నిండిపోయి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయని తెలిపారు. రైతులు పిల్లి శ్రీరాములు, చిట్టూరి వెంకట సుబ్రహ్మణ్యం, బోళ్ల మరియా, బోళ్ల లవకుమార్, తాళం సుబ్బారావు, కేతా రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

కాలేజి ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వరరావు

గణపవరం : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని తాడేపల్లిగూడెం డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గణపవరం డిగ్రీ కాలేజీలో జరిగిన సింగిల్ మేజర్ కోర్సు, గోల్ సెట్టింగ్‌పై ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. ఈ వర్క్‌షాపుకి కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింగిల్ మేజర్ సిస్టం అనేది నేటి తరానికి అవసరమని చెప్పారు. దీనిపైన విద్యాశాఖ అధ్యయనం చేసి సింగిల్ మేజర్ కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో స్కిల్ కోర్సులపైన, అనలిటికల్ స్కిల్స్‌పైన అవగాహన పెంచుకోవాలని అన్నారు. వర్క్‌షాపులో టి.అక్కిరాజు మాట్లాడుతూ ఎన్ఇపి 2020 జాతీయ విద్యావిధానంలో ఒక ఏడాది డిగ్రీ కోర్సు పూర్తి చేస్తే ఒక సర్టిఫికెట్, రెండేళ్లు కోర్సు చేస్తే డిప్లొమో సర్టిఫికెట్, మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ సర్టిఫికెట్ పొందవచ్చని చెప్పారు. నాలుగేళ్లు కోర్సు పూర్తిచేస్తే హానర్ డిగ్రీ లేదా పిహెచ్‌డి ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. ఈ వర్క్‌షాపుకి ఏలూరు, కామవరపుకోట, డిగ్రీ కాలేజీల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు హజరైయ్యారు. గణపవరం డిగ్రీ కాలేజీ లెక్చరర్లు కె.స్వరూపరాణి, కెవి.గణేష్ కుమార్, శ్రీనివాసరావు, జి.వెంకటరమణ మాట్లాడారు.

ఘనంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ పుట్టినరోజు


ఎంఎల్ఎకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - తణుకు

తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన నివాసంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం రాధాకృష్ణ స్వగృహంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తణుకు నియోజకవర్గం నుంచి టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చి ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు, అధికారేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేసేందుకు పుష్పగుచ్ఛాలతో పాటు పెన్నులు, పుస్తకాలు తీసుకొచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తణుకు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆరిమిల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా వావిలాల సరళాదేవి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సరళాదేవి స్వయంగా పెయింటింగ్ చేసిన ఎంఎల్ఎ, ఆయన సతీమణి, కుమారుడు ఫొటోను వారికి అందజేశారు. పెయింటింగ్ ఫొటో అందుకున్న రాధాకృష్ణ, ఆయన సతీమణి లక్ష్మీతులసి సరళాదేవికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వావిలాల వెంకటరమేష్, వావిలాల పవన్‌కుమార్, వింజమూరి సుబ్రహ్మణ్యం, నక్కా సుబ్బారావు, బత్తుల వెంకటరమణ, బోడపాటి నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక వ్యాపార సంస్థలు, చిల్లర దుకాణాల వద్ద కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పలుచోట్ల వ్యాపారుల దుకాణాలు ఓపెన్ చేసే కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెకానిక్ షెడ్లు, మిఠాయి దుకాణాలు, కిరాణా కొట్లు, చిల్లర దుకాణాలు, కాఫీ హోటల్స్‌లలో ఈ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో ఒకటి, రెండు చోట్ల పట్టుబడ్డ యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. కార్మిక శాఖ అధికారి ఎం.కిరణ్ కుమార్, విద్యాశాఖ, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెనుమంట్ర : ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా ఉండి వాహనదారులు ఇబ్బందిపడిన మార్టేరు వంతెన నుంచి కనకదుర్గమ్మ గుడి వరకు ఉన్న కెనాల్ పక్క రాష్ట్ర రహదారి సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. రూ.కోటి 50 లక్షల అంచనా వ్యయంతో 700 మీటర్ల మేర రెండు లైన్లుగా ఈ సిమ్మెంట్ రోడ్డు పనులు చేస్తున్నట్లు తణుకు ఆర్అండ్‌బి జెఇ ఆలపాటి యశ్వంత్ తెలిపారు. ఈ రోడ్డు నుంచి పాలకొల్లు లారీల స్టాండు వరకు 9 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణం రూ.26 కోట్ల వ్యయంతో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

నరసాపురం : శ్రీగౌతమి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో అనేకమంది స్త్రీలు ఈ క్యాన్సర్ బారినపడటం జరుగుతుందన్నారు. చాలా మందికి క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడం వల్ల తొలిదశలో గుర్తించలేకపోతున్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది.